క్లుప్తంగా

నెహ్రూ అవార్డు గ్రహీతకు సత్కారం



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న సహోద్యోగులు

ఉక్కునగరం: జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు అందుకున్న ఇంజినీరింగ్ షాప్స్ ఎలక్ట్రికల్ ఏజీఎం ఎం. రాజశేఖర్‌ను సహోద్యోగులు సత్కరించారు. విభాగంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అధికారులు, కార్మికులు ఆయనకు శాలువా కప్పి అభినందించారు. రాజశేఖర్ చేసిన సేవలకు గుర్తింపుగా యాజమాన్యం ఆయనకు ఈ అవార్డు అందజేసిందన్నారు. కార్యక్రమంలో విభాగం అధికారులు టి. అప్పలరాజు, పోలాజి, గుప్త, వర్మ, శశిభూషణ్, కార్మిక నాయకులు పులి రమణారెడ్డి, గణపతిరెడ్డి, బి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల అమలు కోసం ఎన్‌జేసీఎస్ కన్వీనర్‌కు లేఖ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ జాతీయ కార్యదర్శి లలిత్ మిశ్రా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎన్‌జేసీఎస్ కన్వీనర్‌కు లేఖ రాశారు. దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులకు 2021 అక్టోబర్ 21న వేతన ఒప్పందం జరిగిందన్నారు. ఆ ఒప్పందాన్ని సెయిల్ యాజమాన్యం వెంటనే అమలు చేసింది కానీ, విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇంతవరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. కన్వీనర్‌గా ఈ విషయంపై దృష్టి సారించి, స్టీల్ కార్మికులకు తక్షణం నూతన వేతనాలు అమలు చేసేలా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి సూచించాలని కోరారు. ఈ లేఖను స్టీల్ సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి. దాస్, యు.రామస్వామి స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు మంగళవారం అందజేశారు.

పెట్రోల్ బంక్‌లో అధికారుల తనిఖీ



షీలానగర్ పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ పెట్రోల్ బంక్‌లో తూనికలు, కొలతలు, పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పెట్రోల్ రీడింగ్, కొలతల పరిమాణం, పెట్రోల్ సరఫరా చేసే పంప్, నాణ్యత వంటి అంశాలు పరిశీలించారు. పరిశీలించిన అన్ని అంశాలు సంతృప్తికరంగా ఉన్నాయని ఏఎస్‌వో కృష్ణ, తూనికలు, కొలతల శాఖ అధికారి రామచంద్రయ్య తెలిపారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ భాష అమృతం



మాట్లాడుతున్న అద్దంకి రాఘవాచార్యులు

పెదగంట్యాడ: అమ్మ భాష అమృత తుల్యమని సాహిత్య సుధ వ్యవస్థాపకుడు అద్దంకి రాఘవాచార్యులు అన్నారు. మాతృ భాషా ప్రాభవాన్ని దశ దిశలా చాటాలని సూచించారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాలని తెలిపారు. జీవితంలో పైకి ఎదిగేందుకు ఎన్ని భాషలు నేర్చుకున్నా, మాతృభాషను మరచిపోరాదన్నారు. మన కవులు మన మాతృభాష తెలుగు అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. గ్రంథాలయ అధికారి శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లత, విజయ, రాంబాబు, సురేష్ తదితర పాఠకులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు మార్గం సుగమం

- హౌస్ కమిటీ సమస్య పరిష్కారంపై హర్షాతిరేకాలు
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు
- వైఎస్సార్‌సీపీ నాయకుల సంబరాలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: గాజువాక హౌస్ కమిటీ సమస్య పరిష్కారంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 30 ఏళ్ల నాటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని చెప్పారు. గాజువాక హౌస్ కమిటీ సమస్యపై ప్రభుత్వం జీవో నంబర్ 71ని విడుదల చేయడంతో వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జీవో నం.71

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేలు పల్లా సింహాచలం, మానం ఆంజనేయులు అప్పట్లో తీసుకున్న నిర్ణయాల కారణంగా హౌస్ కమిటీ సమస్య వచ్చిందని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జీవో నెంబర్ 44ను తీసుకువచ్చారని, హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించారన్నారు. తర్వాత కాలంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీవో నెంబర్ 301ను తీసుకువచ్చారని, దీని కారణంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో గాజువాక ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. తమ అభ్యర్థనను మన్నించి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జీవో నెంబర్ 71ను తీసుకువచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేసుకునే విధంగా కొత్తగా జీవోను రూపొందించారని చెప్పారు. జీవో నెంబర్ 71ను తీసుకురావడంలో ముఖ్య పాత్ర పోషించిన ఎంపీ విజయసాయిరెడ్డికి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రమబద్ధీకరణ జీవోపై సంబరాలు

గాజువాక: గాజువాక హౌస్ కమిటీ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 71పై వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు జరిపారు. 65వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బీసీ రోడ్ కాకతీయ జంక్షన్‌లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోతో హౌస్ కమిటీ సమస్యకు తెరపడిందని పేర్కొన్నారు. ఇకపై సమస్య పునరావృతం కాకుండా జీవో 71ని జారీ చేశారన్నారు.

కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, మహ్మద్ ఇమ్రాన్, బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, ఉరుకూటి చందు, వార్డు ఇన్‌చార్జిలు ధర్మాల శ్రీను, బోగాది సన్నీ, నాయకులు మార్టుపూడి పరదేశి, మంత్రి రాజశేఖర్, రాజాన వెంకటరావు, గొందేశి వెంకటరమణారెడ్డి, వాడపల్లి రామచంద్రరావు, రెడ్డి జగన్నాథం, పిట్టా సూర్య ప్రకాష్‌రెడ్డి, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, మహ్మద్ గౌస్, మద్దాల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్పోర్ట్స్‌లో విజ్ఞాన్ విద్యార్థులకు కాంస్య పతకాలు



విజేతలను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

అగనంపూడి: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రోలర్ స్పోర్ట్స్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ విద్యార్థులు సత్తా చాటారు. ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన ఈ పోటీల్లో ఏడుగురు విద్యార్థులు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఎ.విన్సీ హడ్సన్, శైలేంద్రసింగ్, ఆకాష్‌నాయుడు (మెకానికల్), కె.స్వాతినాయుడు, పి.కావ్య (కంప్యూటర్ సైన్స్), పి.సత్య శ్రీజ (ఎలక్ట్రానిక్స్) బి.సంధ్య (ఏఐఅండ్ డీఎస్) పోటీల్లో తృతీయ స్థానాల్లో నిలిచి, బహుమతులు పొందారు. విజేతలను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, జేఎన్‌టీయూకే వీసీ జీ.వి.ఆర్.ప్రసాదరాజు అభినందించారు. ఈ సందర్భంగా దువ్వాడ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లను రెక్టార్ వి.మధుసూదనరావు ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ ద్వారా ఉద్యోగావకాశాలు



సదస్సులో ప్రసంగిస్తున్న బ్రిగేడియర్ రామనాథన్

గాజువాక: ఇంటర్, ఆపై విద్యార్హతతో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) ద్వారా అనేక ఉద్యోగావకాశాలను సులభంగా పొందవచ్చని నేవల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ ఎస్.రామనాథన్ తెలిపారు. ఇండియన్ ఆర్మీ ఉద్యోగావకాశాలపై స్థానిక టీఎస్సార్, టీబీకే కళాశాలలో మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఎన్‌డీఏలో గల ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లలోని వివిధ విభాగాలలో ఉద్యోగావకాశాలు, ఎంపిక విధానాన్ని విపులంగా వివరించారు. కార్పొరేట్ ఉద్యోగాలు, ఆర్మీ ఉద్యోగాల మధ్య వ్యత్యాసాలను తెలియజేశారు. కెప్టెన్ వెంకటేష్ రామశాలి మాట్లాడుతూ త్రివిధ దళాల్లో ఉద్యోగాలను సాధించడం ఎంతో గొప్పగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, కరస్పాండెంట్ ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ విజేతకు సన్మానం



పతకాలు సాధించిన క్రీడాకారుడు గోపీని సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి ఐదు మెడల్స్ సాధించిన క్రీడాకారుడు దుల్ల గోపీని విభాగంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల ఖరగ్‌పూర్‌లో జరిగిన 42వ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్ త్రో, షాట్‌పుట్, పోల్‌వాల్ట్, జావెలిన్ త్రో, 4 X 100 రిలే రన్నింగ్ పోటీల్లో స్టీల్ ప్లాంట్ ఫీల్డ్ మిషనరీ విభాగం ఫీల్డ్ అసిస్టెంట్ దుల్ల గోపీ ఐదు మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం విభాగంలో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి సురేంద్ర ముఖ్య అతిథిగా హాజరై గోపీని అభినందించారు. కార్యక్రమంలో జీఎంలు ఎం.ఎస్.ఎన్. మూర్తి, డీజీఎం జి. బాబూరావు, వివిధ సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, వరసాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నేత్రపర్వం.. స్వామి నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణ మహోత్సవాన్ని మంగళవారం నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించాలి



శ్రీనివాస ఠాగూర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: అనిశ్చిత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించి రాణించే నైపుణ్యాలను యువతరం పెంపొందించుకోవాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఏయూ డీసీఎంఎస్ విభాగంలో నిర్వహించిన ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవం, జాతీయ మేనేజ్‌మెంట్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం సమాజం మారుతుంటుందని, దీనిని తెలుసుకుని తదనుగుణంగా నైపుణ్యాలతో సుసంపన్నం కావాలన్నారు. అజినోమోటో బయో ఫార్మా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్–హెచ్ఆర్ డాక్టర్ పి.శ్రీనివాస్ ఠాగూర్ మాట్లాడుతూ సంక్లిష్ట సమయాలలో అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. మార్పును స్వాగతిస్తూ ముందుకు సాగేవారు నాయకులుగా ఎదుగుతారని చెప్పారు. నిరంతరం అభ్యసనం దీనికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. మైలాన్ లేబొరేటరీస్ హెచ్ఆర్ విభాగాధిపతి జి.సరస్వతీరావు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, విశాఖపట్నం మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య ఎస్. సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వీఎంఏ సభ్యులు, డీసీఎంఎస్ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వీఎంఏ కార్యదర్శి టి.పి.ఎస్.ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

పలకలు శిథిలం

రైతుబజారు మెయిన్ గేటు వద్ద పొంచి ఉన్న ప్రమాదం



పెదగంట్యాడ రైతుబజార్ ప్రధాన గేటు వద్ద పగిలిపోయిన పలకలు

పెదగంట్యాడ: అది పెదగంట్యాడలోని రైతుబజార్. నిత్యం ఉదయం ఆరు గంటలకే చేరుకునే స్టాళ్లకు చెందిన రైతులు, వందలాది మంది కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. అయితే, ఇంతటి రైతుబజార్ ప్రధాన రహదారి గేటు వద్ద నుంచి లోపలికి వెళ్లే మార్గమే ప్రమాదకరంగా మారింది. మెయిన్ గేటు వద్ద పెద్ద కాలువపై పలకలు శిథిలమై రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. గతంలో ఈ కాల్వపై పలకలు ఉన్నప్పుడు కాయగూరల లోడుతో వచ్చే వాహనాలు కూడా లోపలికి వచ్చేవి. అయితే, ఇటీవల ఆ పలకలు పగిలిపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. వాహనాలను రోడ్డుపేనే నిలిపివేసి, సరకులను లోపలికి మోసుకోవాల్సి వస్తోంది. అలాగే ఈ గేటు గుండా లోపలికి వచ్చే కొనుగోలుదారులు ఒక్కోసారి చూసుకోకుండా అడుగేసి పడిపోతున్నారు. గాయాలపాలవుతున్నారు. పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు, కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ప్రమాదాల చోటు చేసుకుండా ఉండేందుకు తాత్కాలికంగా రోడ్డు పక్కనున్న రెండు పలకలను వేసుకున్నారు. అయితే గేటు ముందు పెద్ద కాలువ ఉండడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ తాత్కలికంగా వేసిన పలకలు కూడా పగిలిపోయేలా ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

ఖోఖో విజేతలకు ఎమ్మెల్యే ప్రశంస



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థులు క్రీడల్లో రాణించి, జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆకాంక్షించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రెల్లా ఢిల్లీశ్వరి, సాదశెట్టి కీర్తన, బోదంగి హేమలత పతకాలు సాధించడంతో, వారిని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటి రాష్ట్ర కీర్తిని పతాక స్థాయిలో నిలపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉన్నతికి ఎంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, పీడీ మహ్మద్ ఇస్మాయిల్‌ను అభినందించారు.

అభినందించిన కార్పొరేటర్

ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు గెలుచుకున్న ముగ్గురు విద్యార్థులను 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం



740వ రోజు దీక్షలో పాల్గొన్న సింటర్ ప్లాంట్ కార్మికులు

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా, కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 740వ రోజు సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. విభజన హామీలను విస్మరించి, రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఐక్య ఉద్యమాలతో ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో పారిశ్రామిక వేత్తల్లో ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో వరుస దొంగతనాలతో పారిశ్రామిక వేత్తలు తలలు పట్టుకుంటున్నారు. లక్షలాది రూపాయల విలువైన వస్తువులు దొంగలపాలవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. దొంగలు గంజాయి సేవించి ఉంటున్నారని, దేనికైనా తెగించేలా ఉన్నవారిని నిలువరించలేక నిస్సహాయంగా ఉండిపోతున్నామని తెలిపారు.

స్పేర్‌పార్ట్‌ల అపహరణ

ఆటోనగర్ బీ బ్లాక్‌లో కనకదుర్గా వైర్స్ అండ్ రోప్స్‌లో శుక్రవారం సుమారు 8 మంది దొంగలు రూ.2 లక్షల విలువైన ఇంపోర్టెడ్ స్పేర్ పార్ట్స్‌ను దొంగిలించినట్లు సంబంధిత పారిశ్రామిక వేత్తలు తెలిపారు. సోమవారం గోదావరి వాటర్స్ వద్ద పరిశ్రమలో, తోకాడలోని రెండు పరిశ్రమల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారని, అక్కడ కూడా సుమారు రూ.2 లక్షలకు పైగా విలువైన సిలిండర్లతో పాటు పలు వస్తువులను అపహరించారని తెలియజేశారు. ఈ చోరీలపై గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశామని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) ప్రతినిధులు తెలిపారు. ఐలా పెట్రోలింగ్ సిబ్బంది, గాజువాక పోలీసులు సంయుక్తంగా గస్తీ నిర్వహిస్తున్నా ఉపయోగం లేకపోయిందన్నారు. చోరీకి గురైన స్పేర్ పార్టులు, సిలిండర్లు ఆటోనగర్‌లోని స్క్రాప్ దుకాణాల్లో ఎక్కడైనా ఉండవచ్చని, దుకాణాల్లో వెదికించాలని పారిశ్రామిక వేత్తకు పోలీసులు సూచించారని వాసీవా ప్రతినిధులు తెలిపారు.

నిరుపేదలకు ఆహార వితరణ



పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు పరిధి దువ్వాడ, కొత్తూరు కాలనీ, వెదుళ్లనరవల్లోని 150 మంది నిరుపేదలకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బిర్యానీ పొట్లాలు అందించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు మొల్లి ముత్యాలు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చట్టి తాతారావు, మాడిశ సత్యనారాయణ, బొట్టా అప్పారావు, బి.బి.రాజు, దండు మహేష్, కుమార్, నాయుడు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఎ.మురళీకృష్ణ అనే దాత రూ.1,00,116 విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నదాన విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు. అధికారులు దాతకు స్వామివారి దర్శనాన్ని కల్పించి ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన విభాగం సిబ్బంది హరి పాల్గొన్నారు.


క్రాష్ హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం



హెల్మెట్ వినియోగంపై ప్రచారం చేస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: క్రాష్ హెల్మెట్ ధరించడం ద్వారా సురక్షితంగా ప్రయాణం చేయగలరని స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) విభాగం అధికారులు అన్నారు. విభాగం భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఉక్కు భద్రతా విభాగం సహకారంతో మెయిన్ గేటు వద్ద మంగళవారం క్రాష్ హెల్మెట్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రయాణాల్లో అత్యధికంగా హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నిర్ణీత వేగం, రహదారి నిబంధనలు పాటిస్తూ ఉంటే ప్రమాదాలను అధిగమించవచ్చన్నారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో విభాగం డీజీఎంలు వి. వెంకటేష్, ఎస్. రమణమూర్తి, ఎస్. శ్రీధర్, భద్రతా విభాగం సీనియర్ మేనేజర్ పి. కృష్ణమూర్తి, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎస్.వి. చిన్నం నాయుడు, బి.వి.ఎస్. ప్రకాశ్, కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ తీర్థ మహోత్సవం



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం



దుర్గమాంబ అమ్మవారు

సబ్బవరం: సబ్బవరం మండల ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులు వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. అమ్మవారి దర్శనానికి సబ్బవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయ విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రికి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాం ఆకట్టుకుంది.

పబ్లిక్ డిమాండ్

రాజీవ్‌నగర్‌లో పందుల బెడద



రాజీవ్‌నగర్‌లోని సరిత స్టీల్స్ వద్ద సంచరిస్తున్న పందులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో పందుల సంచారం ఎక్కువగా ఉంది. చెత్తకుప్పల వద్ద చేరి చెత్తను చిందరవందర చేయడంతో పాటు ఆ దారి మీదుగా వెళ్లేవారిపై దాడికి దిగుతున్నాయి. చేతుల్లో ఉన్న వస్తువులు లాక్కోవడం, చిన్న పిల్లల వెంటపడి దాడికి దిగడం చేస్తున్నాయి. డ్రైనేజీల్లో తిరిగిన పందులు ఇంటి పరిసరాల్లో తిరగడం, ఇళ్లలోకి చొరపడటంతో అంతా బురదమయంగా మారుతోంది. తరచూ రోగాలబారిన పడుతున్నాం. అధికారులు స్పందించాలి. పందుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి.

–సుకన్య, రాజీవ్ నగర్